# వాడని (డిన) పువ్వు ★

రచయిత:
వి. రామేశ్వరమ్ బి. ఏ,

అహల్యతో పరిచయం అతివిచిత్రంగా జరిగింది నాకు.

ఒకరోజు సాయంత్రం ఆరు గంటలయింది. గాంధిపార్కు రకరకాల చెట్లతో, పూలతో శోభాయమానంగా వుంది. అందమయిన భార్యతో ఒక అనాకారిభర్త ఏదో చెప్పేస్తున్నాడు ఒక బెంచిమీద కూర్చొని. వారి కెదురుగా యింకొంచెందూరములో యువతీయువకులు ప్రేమప్రసంగాన్ని పరిణయమాడేస్తున్నారు. ఇంతలో ఎవరో అడుక్కునే కుర్రవాడు వచ్చి ప్రసంగాన్ని ఆపమన్నట్లుగా వారి దగ్గర నుంచున్నాడు చెయ్యిచాపి. "చిల్లర లేదురా అబ్బి వెళ్ళు" అన్నాడు పానకంలో పుడకలాగా వచ్చాడని యువకుడు. యువతి అందుకొంది. "నిజంగా లేదూ నీ దగ్గర. ఆ జేబులో కనిపించేదేమిటి ఉండ్రా అబ్బీ" అని అతని జేబులోనుంచి అర్థరూపాయనాణెం అమాంతంలాగి వాడిమీద విసరిందా వనిత. వాడు నవ్వుకుంటూ అదితీసికెళ్లాడు. యువకుని మొహం గ్రహణంపట్టిన చంద్రుడిలా వుంది. కాని పైకలా కనిపించలేదు. అటూ యిటూ బారులు బారులుగా వున్న పూల మొక్కలమధ్య మంచిబాట వుంది. అనాకారి భర్త అతిమోటుగా రెండు పూలు కోశాడు. భార్యతల్లోపెట్టి ఒకసారి యికిలించాడు. మీ అందరితో నాకేమీ సంబంధం లేదన్నట్లుగా "నల్లనిమబ్బుల గుంపులు గుంపులు తెల్లని కొంగల బారులు బారులు" అంటూ మబ్బుల కేసి చూస్తూ పాడుతుంది మునిసిపాలిటి రేడియో. మెల్లగా అటువైపే నడుస్తున్నాను కొంచెందూరములో ఒక స్త్రీ, ఆవిడ వెంట ఒక నాలుగయిదేళ్ల కుర్రవాడు వస్తున్నాడు. సమీపించి నన్ను చూసీచూడగానే 'అన్నా' అంటూ చుట్టేశాడాబ్బాయి నన్ను. ఇదేమిటా అని నే నాశ్చర్యపోయాను. ఆమె కట్టుకొన్న మల్లెపువ్వులాంటి తెల్లనిచీర శరీరపు వంపు సొంపులను వయ్యారంగా చూపిస్తోంది నాకు. ముఖాన్నిబొట్టు మాయమయినట్లుంది. హిమవన్నగం మాట్లాడబోతున్నట్లు నోరు విప్పింది. నిదానించి నిదానించి చూసింది నా మొహంలోకి. అందులో నిర్మలత్వము కనిపించిందేమో!

"క్షమించండి! వాళ్ళన్నగారి పోలికలు మీలో చాలవున్నయి. వారీమధ్యనే పోయారు. మిమ్మల్ని చూసి వారే అనుకుంటున్నట్లున్నాడు" మంచుపర్వతం మాట్లాడింది కొంచెం తప్పుజరిగిందన్నట్లుగా. "ఫరవాలేదులెండి" అని ఒకసారి ఎత్తుకొని ముద్దుబెట్టుకొని క్రిందదించాను. "వాసూ యిలా రా" అంది. "బాబూ వదినదగ్గరకువెళ్ళు" అనాలనిపించి అన్నాను వెళ్లాడు. వెళ్లారు.

ఇది జరిగి చాలారోజులయింది. ఒకనాడా వీధిలో వెడుతున్నాను. ఆశ్చర్యం! మళ్లీ కనిపించిందా అందాలదీవి. శాపముపొంది భూలోకంలో నివసించవచ్చిన గంధర్వాంగనలా కూర్చొనివుంది వీధి అరుగుమీద ముఖమటువైపుత్రిప్పి. ఆ యిల్లుదాటి నాలుగయి దడుగులు వేశానో లేదో "ఏమండి" అని కోమలి కంఠం పిలిచినట్లయింది. వెనుదిరిగిచూచి పిలిచారా అన్నట్లు దృష్టిసారించాను. "మీకే మభ్యంతరంలేకపోతే ఒక మారిలా లోపలికి వస్తారా" అనడిగిందతి సహజంగా ఆ గంధర్వాంగన. ఏ విధమయిన సంకోచాలకు తావివ్వకుండా లోపలికి వెళ్ళానసలు విషయమేమిటోనని. ఒక కుర్చీచూపించి 'కూర్చోండి' అంది మాట్లాడకుండా కూర్చున్నాను. చాలా బిడియపడుతున్నట్లుగా మొదలెట్టింది. "మొన్న పార్కులో మిమ్మలను చూడగనే ఎవరో ఆప్తులను చూసినట్లయింది. మరల యిప్పుడు చూడగనే అదేమిటో తప్పక పలకరించాలనిపించింది. అందుకే పిలిచాను. మీరేమి తప్పుగా భావించరనుకొంటాను." ఆ యింటి పరిశుభ్రతను పరిశీలిస్తూ లేదన్నట్లు మౌనంగా సమాధానం చెప్పాను. "కొందర్ని చూస్తే మంచితనం వారిని వరించిందా లేక వారే మంచితనాన్ని వరించారా అన్నట్లు కనిపిస్తారు. మీరు మొదటికోవకుచెందిన వారిలా నాక్కనిపించారు. అందుకే మిమ్ముల్ని చూడగనే నా బాధలన్నీ ఒకమారు మీముందు వెళ్లబోసుకోవాలనిపించింది. విసుగు లేకుండా వుంటుందనుకుంటా వింటానికి మీకు". ముఖస్తుతి మొదలెట్టిందా అనిపించినా, లేదన్నట్లు మొహంపెట్టాను. "నేనొక దుర్భాగ్యురాల్ని. పదిహేనవ ఏటనే స్థిరచరాస్తుల్లో ఏ ఒక్కటీ అంతగాలేని ఒక యస్ జి వోని పెళ్లాడాను. అంటే యిప్పటికి సరిగా రెండేళ్ళనాడు. జీవించినంతకాలము అతని చాకిరితోనే సరిపోయింది. రెండు సంవత్సరాలు మాత్రమే జీవించినా, ఆడదాని కాభరణాలమీద అమితమైన మోజు అనేవారు నాకేనిధమైన నగలు చేయించకున్నా. అసలీమాట నాదగ్గర అనవలసిన అవసరములేదు. యీ విధమయిన మాటలతోటి పుట్టెడు చాకిరితోటి పూజించాడు. యీమధ్యనే హఠాత్తుగా గుండె ఆగి చనిపోయారు నా ఖర్మానికి నన్ను వదలి. మామగారి కుటుంబం యావత్తూ నీటిలో కలిసింది వరదలమూలంగా. చిన్నపుడే నాన్నగారు పోయారు. తల్లి ఒక్కతైనా మిగిలివుందని కబురంపాను. దురదృష్టవంతులను దేవుడు గూడా కరుణించడు. మా అమ్మాగూడ ఆ దినమే చనిపోయిందని వార్త తెచ్చాడు వెళ్లిన మనిషి. అప్పుడు నాపరిస్థితి ఏమని చెప్పను. నే నెవరికొరకు జీవించాలి అనిపించింది. వాసు మొహంలో నా కొరకు సుమీ అన్నవిషయము స్పష్టంగా కనిపించింది. జీవించి సాధించాలి అనుకున్నాను. ఏమిటి ఎలా అని నిశ్చయించుకోలేదు. రత్నంలాంటి మగదిని వదలినందుకు మనసులో నే మరిమరి ప్రణామాలర్పించాను భగవంతునికి. మే మీవూరు క్రొత్తగా వచ్చాము. ఎవరూ తెలియదు. కనీసం యిప్పటినుంచయినా ఏదేని పనిచేసి జీవితము వెళ్ళబుచ్చునా మనిపిస్తుంది. మీరేమన్నా సహాయపడగలరేమో అనిపించింది. అంతే పిలిచాను" అని ముగించింది.

ఆమె చెప్పేపద్ధతినిబట్టి చూస్తే యిందులో నమ్మగూడని విషయమేమి లేదనిపించింది నాకు. అందుచేతనే ఏదేని సహాయం చెయ్యాలనిపించింది. ఏదయినా పనిచేసుకొని జీవిస్తానంటుంది. ఏమి పనిచేస్తుంది? ఎక్కడ చూపించాలి? అసలామెను చూస్తే ఏపని చెయ్యనియ్యా గూడదనిపించింది నా అంతరాత్మ. మరి జీవనోపాధి? ఆలోచించి చివరకన్నాను నే నున్నన్నాళ్ళు తనకేమి భయమక్కరలేదని. వాసుని పెంచి పెద్దవాణ్ణి చేయాల్సిందని తన కవసతమయినంత ధనసహాయంచేస్తానని చెప్ప నేనుచేసే సహాయం

అప్పుగా భావిస్తే వాసు సంపాదనపరుడైన తరువాత తీర్చవచ్చునని అన్నాను. వాసును తీసికెళ్లి నేనుండే యిల్లు చూపించానారోజు.

*  *  *

ఆ యింట్లో చేరిన తరువాత ఉన్నట్లుండి ఒక ధర్మసందేహం వచ్చింది యింటి యజమానురాలు అనసూయమ్మ (రామనాధంగారి యిల్లాలు)గారికి నాగురించి. ఆ వచ్చినట్లు "ఏమండీ మీకు వివాహం కాలేదుకదూ" అని నన్నారోజు అడగడంతో నాకు తెలిసింది. వాళ్లింట్లో నేను చేరబోయేముందుగా గాని, చేరినతర్వాత చాలా రోజులవరకు గాని యీ విషయం నన్నెవరు అడుగనూలేదు, నేనూ చెప్పలేదు. ఇన్నాళ్ళబట్టి ఆ వి డ ఏమనుకుంటుందో మరి. ఆ యిల్లు సాధారణంగా ఎవరికీ యిచ్చేవారుకారుట. అయినప్పటికి ఎందువలననో నే నడగ్గానే యివ్వాలనిపించి యిచ్చారుట. కొందరు ఇంటి యజమానులు సాధారణంవేశే " చదువుకుంటున్నారా ? ఏ వూరండీ ? ఎవరికి కావాలండి ? " ఇలాంటి ప్రశ్నల్లో ఏ ఒక్కటి వెయ్యకుండా "మీ యింట్లో ఒక భాగం ఖాళీగా వుందన్నారు, కొంచెం చూపిస్తారా" అని నే నడిగీ అడగడం తోటే "లోపలికి రండి! చూపిస్తాను" అంటూ తీసికెళ్లడం, చూపించడం నరేనని మరుసటి రోజే నా సామానుతో ప్రవేశించడం జరిగింది. ఇప్పుడడిగిన ప్రశ్నకు సూటిగా సమాధానమివ్వకుండా "ప్రస్తుతానికి కానట్లు లెక్కేనండి" అని అటూ ఇటూ కాకుండా చెప్పాను. ఎలా అర్థమయిందోగాని ఇంకేమడక్కుండా వాళ్ళింటికెళ్ళింది కొంచెం బరువైన శరీరాన్ని మెల్లగా కదిలిస్తూ. ఇల్లంటే ఎక్కడో కాదు ఆ ప్రక్కనే.

రామనాధంగారికి స్వంతవూళ్ళో ఒక ఇరవై ఎకరాల మాగాణి రెండు మేడలు వున్నయి. వూళ్ళోకల్లా ధనవంతుడు. ఆరోజుల్లో కమ్యూనిస్టులనబడేవారు ధనవంతుల యిళ్లమీదపడి దో చు కు ం టు న్నా ర ని భావించేవారు పల్లెటూళ్ళలో. అడ్డువచ్చినవారి ప్రాణాలుతీసేస్తారని అ త ని కి భయమేసింది అందుచేత వెంటనే యీ పట్నానికి మకాం మార్చాడు స్థిరాస్తి యిప్పటికి వుందక్కడ. చరాస్తి మాత్రం జాగ్రతగా పట్నానికి తరలించాడు. ఫస్టుక్లాసయిన మేడ కట్టించి భార్య, కూతురు తనూ వుంటున్నారిపుడు. పట్నవాతావరణానికి పూర్తిగా అలవాటుపడ్డాడు. వ్యవహారవిషయాల్లో చాలామందిని మించాడు ముంచాడు. అతనికి రావలసిన బాకీలవాళ్లు ఒక్కదమ్మిడీ ఎగవేసినవాళ్ళులేరు. ఇదే పట్నంలో అతని మేడప్రక్కనున్న రమణయ్యగారిదగ్గర పుచ్చుకున్నవారిలో నలుగురు దివాలాతీశారు వ్యాపారంలో ఏదో నష్టమొచ్చిందని చెపుతూ. రామనాధంగారింట్లో నాలుగు ఇనప్పెట్టెలున్నాయి. అందులో ఎల్లపుడూ కరెన్సీనోట్ల కట్టలయినా వుంటాయి. లేకుంటే వీశలకొద్దీ బంగారమన్నా వుంటుంది. వారింట్లో బంగారు గ్రుడ్లుపెట్టే బాతు లేకున్నా నాలుగు యినప్పెట్టెల్లోనినోట్లు రోజుకొక గ్రుడ్డుపెడుతుంటాయివడ్డీరూపంలో.

రామనాధంగారి కూతురు మేనక. యీ అమ్మాయికి నాజూకులపై మోజు యెక్కువ. మా సుందరి యీమధ్యనే బి.ఏ., లాగిపారేసి యూనివర్శిటీలో చేరతానంటూ వాళ్ళనాన్నగార్ని పోరుపెట్టింది. కాని ఆయనగారు సుతరామూ అంగీకరించలేదు పెళ్లిచేద్దామనే ఉద్దేశంతో. మేనక పట్టినపట్టు ఏమంత గట్టిది కాదు. అందువల్ల మెదలకుండా వూరుకుంది అతనంగీకరించనపుడు. ఇ ం ట్లో ప్రస్తుతం డిటెక్టివ్ నవలలు చదువుకుంటూ కూర్చుంది వాళ్ళనాన్నగారికి తెలియకుండా. ఆ య న చూశాడంటే "అ పుస్తకాల్లో ఏముంటుందమ్మా. ఏ రామాయణమో, భారతమో చదువక" అంటాడు. బావ రామకృష్ణతో బహు రహస్యంగా ఉత్తరప్రత్యుత్తరాలు సాగిస్తుంది. రామనాధంగారిపుడు వీలయినంతమంది డాక్టర్లనీ ఇంజనీర్లని కలుసుకుంటున్నాడు తన కూతుర్నిచ్చి ఒక యాభై వేలు కట్నమిస్తానని. కాని వారందర్నీ మిస్ మేనక కొద్దిలో మిస్ అవుతుంది. కారణం, ఒకటే కారణం మిస్ మేనక మెల్లకన్ను!!! యిన్నాళ్ళు కాలుమీద కాలువేసికొని కూర్చున్నా రామనాధంగారికిపుడు తీ రి క లే ని ప ని చేతిలో కొచ్చింది మిస్ మేనకమూలంగా.

మేనక మనసు రామకృష్ణమీద మరలిందని అతనికి తెలియదు.

*  *  *

బాలభానుని అరుణకిరణాలు ఒక్కొక్కటే తలుపుసందులోంచి కి టి కీ సందుల్లోనుండి గదిలో పడుతున్నాయి. బయట చిలుకల కిలకిలలూ పిట్టల పకపకలు చెట్లమీదనుండి వినవస్తున్నయి. మ గ త గా నిద్రలోనుండే వింటున్నా యివన్నీ. లేవడానికి బద్ధకంగా వుంది అంత ప్రొద్దెక్కినా. కాని "అమ్మాయిమణీ" అని అనసూయమ్మగారు ఒక కేకతో నిద్రమత్తు వదలింది. కి టి కీ తెరచాను పూర్తిగా. రాత్రి చలిలో మొక్కలు పూలు చిందులువేసి అలసి నిద్రిస్తున్నవా అన్నట్లు గోడప్రక్కనున్న వరుస వరుస కనిపిస్తోంది. ఇంటిచుట్టు ఎత్తయిన ప్రహరీగోడ. అవరణలో ఎన్నో రకాల పూలచెట్లు చిలకల నాకర్షించే జామిచెట్లు మనుషుల నాకర్షించే మల్లెపందిర్లు ఎన్నో వున్నాయి. కొబ్బరిచెట్లు మెజెస్టిక్‌గా నిల్చునివున్నాయి అక్కడా యిక్కడ. చూడటానికదొక ఉద్యానవనం. రామనాధంగారు మేనకా విహారానికది వేయించారేమో! చిరుగాలి ఇంకా వీస్తునేవుంది. పసిమివన్నెతో పరిహాసమాడే శరీరచ్ఛాయగల ఒక వన్నెలాడి పందిరిక్రింద వెండిపూలబుట్టలోకి మల్లెపూలు కోస్తుంది వయ్యారంగా. పైనచూస్తూ ప్రక్కకు జరిగింది. అరిటాకుల్లాంటి అరికాల్లో కసుక్కున ఒక పెద్దముల్లు గుచ్చుకుంది. అబ్బ అని కాలు కొంచెమెత్తి ముల్లుతీయబోయింది కంగారుగా. ఒంటికాలుమీద నిల్చొనడములో బ్యాలెన్సు తప్పిందేమో పూలబుట్ట జారవిడచింది. ఇదంతా చూస్తున్నాడల్లేవుంది. అటువైపునుండి ఎవరో యువకుడువచ్చి గడ్డిమీద ఆ అమ్మాయిని కూర్చోమని మెల్లగా ముల్లును తీశాడు. క్రి ం ద ప డి న పూలు ఒక్కొక్కటే బుట్టలో వెయ్యబోతున్నాడు. వారించిందామ్మాయి. మెళ్ళో సన్ననిగొలుసు, సన్నటి గ్లాస్కో లాల్చీవేసికొనివున్నాడా యువకుడు. ఎందుకనో నా కిటకీవైపు ఒకసారి తిరిగి చూశాడు. అరే! వీడు మా రామకృష్ణే! కళ్ళు నులుపుకొనిచూశాను మరలా చూశాను వాడు కాదేమోనని. వాడే నిజంగా! రామకృష్ణకాలేజి మేట్ ము ఖ్య స్నేహితుడు. అయినప్పటికి కాలేజి వదలగానే అ ం త స్నే హ ం మఱచిపోయామా అన్నట్లుగా కొన్నాళ్లబట్టీ ఒక్క ఉత్తరమేనా వాడు వ్రాయలేదు. అంతకన్న బద్ధకస్తుడినైన నే నసలు వ్రాయలేదు. అయినప్పటికీ వాడెక్కడుండేది నాకు తెలుసు. నేనేమి చేస్తుండేది వాడికి తెలుసు. వాడిప్పుడు బొంబాయిలో ఏదో ప్రైవేటుఫరంలో ఉద్యోగం చేస్తున్నాడు. ఉన్నట్లుండి యిక్కడెలా వూడిపడ్డాడా అని ఒక్కసారి ఆశ్చర్యపోయాను. మేనకదగ్గర వీ డి కి ం త చనువుందన్నమాట. వీడ్నిగురించే రామనాధంగారితో చెప్తామనుకున్నా తనకూతురు పెండ్లివిషయమై అంతకు ముందురోజే మాటలసందర్భంలో ఆయనగారు "అమ్మాయికి మీకు తెలిసిన సంబంధమేదేనా వుంటే చెబుదురూ" అని కదిలించినపుడు. వాడప్పుడు నా మనస్సులో మెదిలినా వీడ్నిగురించపుడు చెప్పలేదు. అన

లిప్పుడు నేను చూసినదాన్ని ఏమి చెప్పనవసరమే లేనట్లుంది. ఆరోజే అనసూయమ్మగారు "మీకు వివాహం కాలేదుకదూ" అని అడిగినప్పటినుండి రామనాధంగా రెందుచేతో నాదగ్గర తన స్వవిషయాలు గూడ కొన్ని చెప్పటం మొదలెట్టాడు.

చాలారోజులకు రామకృష్ణను చూశానేమో అంచులో అప్పుడే నిద్రనుంచి మేల్కొంచి చూశానేమో "ఒరేయి రామకృష్ణా" అని సంతోషముతో ఒక్కకేక పెట్టాను. వాడాలోకంలోంచి యిటుపడ్డాడు. మేనక నావైపు చూసిందో వాడివైపు చూసిందో అర్థముకానట్లు ఒక సారలా చూసి యింట్లోకెళ్లింది. గదిలో కొచ్చింతర్వాత రామకృష్ణతో "ఏరా ఎప్పుడొచ్చావు. కనీసం కార్డుముక్కన్నా వేయకుండా వూడిపడ్డావు — ఏమిటి విశేషాలు?" అనడిగాను. వాడారాత్రే వస్తాడుట. నే పడుకున్నతర్వాత వచ్చాడనుకున్నా. రామనాధంగారు ఒక వరుసకు మామయ్యావుతాడుట. ఆ వూళ్ళో రాఘవరావుగారని ఒక లాయరున్నాడు. వాళ్ళమ్మాయిని చూడటానికివచ్చాడుట. ఇందుకని వచ్చినట్లు వాళ్ళమామయ్యతోగాని మేనకతోగాని చెప్పలేదన్నాడు.

* * *

ఒకరాత్రి రామనాధంగారి కుటుంబంతో సహా నేను అహల్యతో కలసి సినిమాకు వెళ్ళొచ్చాము రామకృష్ణ బలవంతంమీద. వాసు నన్ను పిలిచేదాన్నిబట్టి అహల్య ప్రస్తుతాలంకరణనుబట్టి రామనాధం గా రొకటి వూహించారని నే గమనించా.

అహల్యతో పట్టుబట్టి ఒక పండుగరోజు ముత్తైదువలంకరణ చేయించాను. నుదుట తిలకం, చేతులనిండా గాజులు, ఎర్రనిజార్జెట్ చీర, అందాలదీవి అహల్య. హంసగమనాన్ని ధిక్కరించే ఆ నడక, మెళ్ళో రాళ్ల నెక్లెస్, ఆ రోజెమిటో అనిపించింది నాకు. చాలా గంభీరంగా వుండిపోయాను. ఇప్పుడామె భర్తృహీన అని అనుకోడాని కాస్కారంలేదు. అంతగా మారిందహల్య.

రామనాధంగారు నా పెద్దమనిషిప్రవర్తనను బట్టి, మరి యితర కారణాలవలన అహల్యను నేను దూరంగావుంచానని నిజంగా నేనామెకు భర్తనని వూహించినట్లుంది. బయటపడ లేదాయన యీ విషయం ఏ సందర్భంలోనూ. సినిమావదలేటప్పటికి చాలా ప్రొద్దుపోయింది. అందరం యిల్లు చేరుకున్నాం. తనుండే యింటికి వెళ్తానందహల్య. "అమ్మాయి ఇప్పుడేమి వెళతావు. యీరాత్రిక్కడే పడుకో ప్రొద్దుట్నే వెళ్లవచ్చు"న్నారు రామనాధంగారు. నేనుండే భాగంలో మూడు గదులున్నాయి వరుసగా. ఒక దాంట్లోంచి ఇంకొక దాంట్లోకి దార్లున్నయి. అహల్య నొక గదిలో పడుకోమని చెప్పాను వాసుతో వెనుకవైపు ఘడియవేసికోమని. వాసు అప్పుడే నిద్రలోమునిగిపోయేడు. నాకు సరిగా నిద్రపట్టలేదు. అహల్యావాళ్లంతా నిద్రనటిస్తున్నట్లుంది. లేకుంటే నిద్రపోయారో తెలియదు. వాతావరణం చాలా చల్లగావుంది. వెన్నెలరేడు మంచుతోకూడిన వెన్నెలను సగం మాకు పంచియిచ్చాడా అన్నట్లు కిటికీలోంచి విసిరేస్తున్నాడు. ఒకసారిలేచి గదిలో అటూ యిటూ పచారుచేశాను ఏమీ తోచక. నడుం వాల్చాను పరుపుమీద. తెల్లవారుఝామయిందేమో. ఎక్కడో ఒక కోడి కూసినట్లు వినవచ్చింది. మెల్లగా నిద్రవస్తోంది. ఎంతసేపు పడుకున్నానో తెలియదు. ఎందుచేతో ఆ రోజహల్య కలలో కన్పించింది. ఒకరుకారు, యిద్దరు రెండువైపుల నుంచున్నారు. ధరించిన చీర తెలుపా లేక అహల్య తెలుపా అని చెప్పలేనట్లుగా వుంది కర్కశమైన చేత్తో గిచ్చితే కందిపోయినట్లున్నయి ఆ చెక్కుటద్దాలు. ఒకరిని దగ్గరకుతీసి గాఢంగా కౌగిలించానుట. అద్దాల్లో ప్రతిబింబం చూస్తున్నానుట. నవ్వుతూ చేతిలోంచి విడిపించుకుని ఎప్పటిస్థానంలో నించుందట. నేను తాకని అహల్య "ఏమిటీపని" అనడిగింది తాకిన అహల్యను. అహల్య మాట్లాడలేదు. "ఇన్నాళ్ల నుండి యిందుకొరకేనా యీ దుర్మార్గుడు దగ్గర సహాయంపొందింది?" కంఠంహెచ్చించి అడిగింది. మౌనంగా నా వైపొకమారు చూసింది భయపడినట్లుగా. "ఆయన దైవసమానుడు. దుర్మార్గుడు కాదు" ఇంతసేపు పలకని ఆహల్య పలికింది. అడిగిన అహల్య యీమాట విని మాయమయింది.

చల్లనిచేతులేవో నా చెంపలను తాకినట్లయిందా చీకటిలో. వెంటనే మొహంమీద రెండు ముద్దులు కురిపించారు. నేను కళ్ళు తెరవలేదు. స్పర్శతో రక్తంవేడెక్కింది యీ విపరీతమేమిటా అని ఉలికిపడి లేచాను. కలాగిలా ఎగిరిపోయింది ఏదో అరుద్దామనిపించింది. వద్దన్నట్లా చేతులు వారించాయి. చీకటిలో కొద్దిగా చూశాను. గంధర్వాంగన!! దేవేంద్రుడు పంపాడా? గట్టిగా చేతులు పెనవేసుకున్నయి. ప్రక్కమీదనే అలా ఎంతసేపో!! కొద్దిగా వెలుతురు వస్తూంది. గుడ్డి వెలుతురులో బాహువులలోనున్న అహల్యను చూశాను చీకటితప్పు! తలుపెలా తీయబడిందో!! అతి విచిత్రానుభవం !!!

మరొకరోజు.

తెల్లవారేటప్పటికి వంట్లో సరిగాలేదు. జ్వరంవచ్చేసింది చలిచలిగా. వణికిపోతున్నాను. దేనికో వాసు వచ్చాడప్పుడే. చూసి "వదినను పిల్చుకొస్తానుండు" అని పరుగెత్తి తీసికొచ్చా డహల్యను. ఎంతో ఆతురతగా వచ్చింది. గట్టిగానన్నదిమిపట్టుకొని కూర్చుంది ప్రక్కనే. పైన సిండుగా కప్పింది. ఇంతలోనే రామనాధంగారు, అనసూయమ్మ, రామకృష్ణ, మేనక అంతా గుమికూడారు నాచుట్టూ వాసుగాడేడుపుతో. అసలు వాడేడవడానిక్కారణం అహల్య. వచ్చీరాగానే లేకలువలాంటి తన చెయ్యిని నా నుదుటిమీదవుంచి "అబ్బ ఎంత వెచ్చగావుంది. ఎప్పటినుంచండి జ్వరం?" అనడుగుతూ కనుకొలకుల్లో నీరు తెప్పించిందహల్య పొంగి ప్రవహించబోతున్నయి. వలదన్నట్లు చేత్తో తుడిచాను. ఇది చూసి వాసుగాడు ఏడుపు మొదలెట్టాడు. రామనాధంగారు వచ్చిచూసి "భయపడకండి! ఇది మామూలు జ్వరమే, వూరికేపోతుంది" అని చెప్పాడు ధైర్యంగా వుండమన్నట్లుగా. రామకృష్ణ నన్ను వదలకుండా అక్కడే వున్నాడు అమందు ఈమందు త్రాగమంటూ ఆ రోజంతా! రెండురోజులలో చలిజ్వరం తగ్గింది. కాని అహల్య తనయింటికి వెళ్లలేదు, వెళ్తాననలేదు. నాకయి నేను వెళ్ళమనలేకపోయాను, ఇప్పటికి పదిరోజులైంది. పదిహేను రోజుల సెలవు నెల రోజులుగా మార్చాడు రామకృష్ణ. రాఘవయ్యగారి కూతుర్ని చూడటానికి వెళ్ళలేదు. పైగా మేనకతో షికార్లు, సినిమాలు పూర్తిగా రామనాధంగారెందు కభ్యంతరపెట్టటంలేదో అర్థమైంది.

* * *

అర్ధరాత్రిపూట అనుకోకుండా రామకృష్ణ వాళ్ళింట్లో దిగినప్పుడే రామనాధంగారికి రామకృష్ణనుగురించి ఆశారేఖ పొడచూపింది. అందుకనే అతి సంతోషంగా ఆహ్వానించాడతన్ని. నిజంగా రామనాధంగారి కుటుంబానికి భద్రయ్య (రామకృష్ణతండ్రి)గారికి ఇదివరకెప్పుడో వచ్చిన తగాదామూలంగా కొన్నేళ్ల నుండి రాకపోకలులేవు ధనవంతుణ్ణనే గర్వమతనికుందని అలాంటివాని కూతురు గూడ ఆ వాతావరణములోనే పెరుగుతున్నదేనని మేనకను రామకృష్ణకి చేసికోవాడాని కంతకుముందే భద్రయ్యగారికి కొంచె మిష్టములేదు

యీా తగాదాతో ఆ అభిప్రాయాన్ని అసలు తీసేసుకున్నారాయన, రామనాథంగారికి ఒక్కగానొక్క కూతురయినందువలన యావదాస్తి అతని అనంతరము తమకే అవుతుందని తెలిసినా రామకృష్ణ నెలకు నాలుగయిదు వందలు తెచ్చే ఉద్యోగం చేస్తున్నందున మెల్లకంటి మేనకకన్న మంచికోడలునే తెచ్చుకోవాలని భద్రయ్యగారు అభిప్రాయపడ్డారు. రామనాథంగారెలాంటివారంటే తనసాటి ధనవంతుడు తనతో కలిశాడంటే అంతత్వరలో బంధుత్వము కలిపేసుకుంటాడన్నమాట. తన కులస్తుడుగాని మరెవరూగాని, ఆయన నీకెలా బంధువవుతాడని ఎవరూ అతనినడుగలేరు గూడ. భద్రయ్యగారి తత్వానికిది పూర్తిగా విరుద్ధం. అనసూయమ్మగారు కొంతవరకు రాజీపడే మనిషయినప్పటికిని భర్త గీచినగీటు ఇలలోనేకాదు కలలోగూడ చూస్తు భయపడేమనిషి. రామకృష్ణ యీా హఠాన్మాగమనంతో ఆవిడ దృష్టికూడ యిలా మళ్లింది. అసలు రామకృష్ణ రావడమనేది మేనకకు ముందుగానే తెలుసు అమ్మ నాన్నలకు తప్ప. అందుకే అత్యంత సంతోషంతో అతన్ని రిసీవ్ చేసికుంది. రామనాథంగారు మొట్టమొదట ఇన్నాళ్లతర్వాత రామకృష్ణ రావడానికి తెల్లబోయినా ఇంతగా మారిపోయిన అతన్నిచూసి ముచ్చటపడ్డాడు. కానైతే యిప్పుడు తనంతతానే భద్రయ్యగారి దగ్గరకువెళ్లి ఆయనగారి కుమారునికి తన కుమార్తెను చేసికొనమని అడగటానికతనికి ధైర్యంలేదు. భద్రయ్యగారెప్పుడు వీరభద్రావతారంలో వుంటారుట. ఆదివారం ఉదయం ఎనిమిది గంటలు స్నానంచేసి అప్పుడే కుర్చీలో కూర్చున్నాను. పేపరుబాయ్ పేపరిచ్చి వెళ్లిపోతే హెడ్‌లైన్సు చూస్తున్నాను. టేబిల్‌మీద కాఫీపెట్టిన చప్పుడయింది. 'కాఫీతీసుకొండి' అని ప్రక్కనుంచుందహల్య. అబ్బ! ఎంత అందంగావుంది. "ఇంద్రధనుస్సులాటి ఆ కనుబొమలు, ఆ కర్ణాంతాలైన ఆ కళ్ళు చిలుకముక్కులాంటి ఆ ముక్కు అమృతముందోయి యిచట అని పిలుస్తుండే ఆ పెదవులు" అని పేపరులో చూస్తు "త్రాచుపాములాంటి నీ జడనుచూసి భయపడ్తున్నయి అహల్యా" చేయి వెనుకకు త్రిప్పి జడపట్టుకున్నాను గట్టిగా. "ఎవరండీ ఆ సుందరి" పేపర్లోకిచూసిందహల్య. "ఇంకెవరు ప్రక్కనే నిల్చున్న జగన్మోహినివి నీవే" నవ్విందహల్య పలువరుసకాంతి నా మనసుమీదపడి ప్రతిఫలించింది.

రామకృష్ణవచ్చాడు ఏదో అవసరముండి అడుగటానికి అప్పుకొరకు వచ్చినవాడి ముఖమేసుకొని, కాఫీకొరకు యింట్లోకెళ్లిందహల్య, వాడేదో నసిగినట్లయింది. 'ఏరా' అన్నాను. ఆ ఏమిలేదు "మేనకవుంది చూశావు! ఎంత చక్కగా పాడుతుందనుకున్నావు. ఆ పాట కొరకే బొంబాయినుండి వచ్చాను." ఎందుకు ప్రారంభించాడో అర్థంగాలా. వాణ్ణి ఉడికించాలనుకుని "మా బామ్మ అంతకన్నా బాగా పాడుతుందిరా! ఆవిడ దగ్గరకు తీసికెళ్తా వస్తావా" అన్నా. వాడికేదో కొంచెం కోపం వచ్చిందో, లేకుంటే కోపం నటించాడో తెలియదు. "పోరా నీ వెప్పుడు యిలాగే మాట్లాడతావు" అని అసలు విషయం చల్లగా చెప్పాడు చల్లకువచ్చి ముంతదాచడమెందుకని. "మేనకను ప్రేమించాడుట ఆవిడగూడ తన్ను ప్రేమించిందట." యీా రెండు విషయాలు రామనాథంగారితోగాని భద్రయ్యగారితో చెప్పడానికి వాడికి ధైర్యంలేదట! నేను నమ్మలేదు. రామనాథంగారిదగ్గర సాధ్యమయినంతవరకు ఎక్‌స్ట్రాక్టుచేయవచ్చని నన్ను ప్లేబాక్‌గావుంచాలనుకున్నాడు వాడు. ఇది గమనించి "సరేలే ముందు మీ నాన్నగారితో చెప్పొద్దు". అందుకని రేపే బయల్దేరతానన్నాను.

రామనాథంగారే రెడిలోవున్నారేమో నేను చక్రధరపురం వెళ్తామనగానే ఎగిరిగంతేశాడు. చక్రధరపురంచేరి భద్రయ్యగారిల్లు వాకబు చెయ్యాల్సొచ్చింది. రామనాథంగారా వూళ్ళో ఉన్నపుడొకప్రక్కగా వుండేవారు భద్రయ్యగారు. ఆ స్థలములో యిప్పుడొక మేడవుంది. పైన భద్రయ్యగారేదో పచారు చేస్తున్నారు. ఎలాగైతేనేం ఆ యిల్లు కనుక్కొని అందులో ప్రవేశించబోయాము. రామనాథంగార్నిచూసి ఒక విషపునవ్వు పారేశారు భద్రయ్యగారు ప్రక్కననే నున్నందుచేత. నిజములో ఆతిధ్యాభ్యాగతులకుగూడ చాలా మంచి స్వాగతమిచ్చే తత్వమతనిది. తప్పనిసరి అనిపించిందో లేక మరేవిధంగా అనుకున్నాడో గాని భద్రయ్యగారే పలుకరించారు రామనాథంగార్ని "అంతా కులాసా" అని వచ్చీరావడముతోనే. తను వచ్చిన కార్యము నెరవేరాలి గాబట్టి తన గొప్పతనం తగ్గించుకోవాలనుకున్నట్లుంది రామనాథంగారు ఎంతో నెమ్మదిగా మాట్లాడ్డం మొదలెట్టాడు. ఆ పూట జరిగిపోయింది. రోజు జరిగింది. వచ్చిన విషయం రామనాథంగారు బయటపెట్టలేదు. భోజనాలతర్వాత భద్రయ్యగారెక్కడికో పనివుందంటూ బజారువైపుబయల్దేరారు. శారదమ్మ (అంటే భద్రయ్యగారిభార్య) ఒక్కర్తేవుంది. పడక్కుర్చీలో ఒకప్రక్క ముందుహాల్లో పేపరు చదువుకుంటూ కూర్చున్నారు. శారదమ్మగార్ని పిలుద్దామనుకున్నాకాని, నేనే మేడమీదకు వెళ్ళానావిడవుండే గదిసగ్గరకి. "ఏంకావాలండి రండికూర్చొండి" అంటూ ఆప్యాయంగా పిలిచిందావిడ. నేను కూర్చొని ఆవిడ అభిప్రాయం కనుక్కోవాలని, రామకృష్ణ నా ముఖ్యస్నేహితుడని వాడిపుడు నా దగ్గరే వుంటున్నాడని, మేనకను ప్రేమించాడని మీ యిష్టమైతే వెంటనే వివాహము జరిపించవచ్చని చెప్పాను. ఆవిడంతా విని "ఇది జరగదు" అంది ఎందుకు జరగదో చెప్పకుండా "మీ కుటుంబ కలహకారణాలవల్లనే అంటారా!" నడిగా. "అవును అదొకటి. రెండవది కట్నం. మే మడిగినంత ఆయన యిప్పుడివ్వలేదు. డాక్టర్లు యింజనీర్లు అడిగిన దానికంటే రెండురెట్లు అడుగుతాం" సన్నగా నవ్వుతూ అందామె. లోపలికెళ్లి కాఫీకప్పుతో వచ్చిందావిడ. "ఇప్పుడే భోజనంచేశాంగదండి యిప్పుడేం కాఫీ" అని వద్దన్నాను. యీా విషయ మావిడ కెలా తట్టలేదో! అసలు విషయ మిదన్నమాట.

* * *

రామకృష్ణ మేనకను తీసుకొని బొంబాయి వెళ్ళాడు పెళ్లి అయిన కొద్దిరోజులలోనే. బ్రహ్మాండంగా జరిగించారు రామనాథంగారు పెళ్లి. సంవత్సరమయినా తిరుగలేదు. వాడికిప్పుడొక కొడుకు. నాపేరే పెట్టానని వ్రాశాడు మొన్నీమధ్య.

అహల్యను కూతురు కేంపేరు పెడతావన్నానొకనాడు బుగ్గమీద చిటికెవేస్తూ. సిగ్గుతో "మీపేరు కృష్ణ — ఆయనపేరు రామకృష్ణ" కాబట్టి "కృష్ణవేణి" పెడ్తామంది. ★


## ఓట్టో లీలా సెంటు

ఎల్లప్పుడును మీరు మనస్సంతోషముగా ఉండవలయునన్న మా సెంటును ఉపయోగించవలయును. మీరు ఎన్నో సెంట్లను చూచియుందురు. ఈ సెంటును మీరు కొంచం చేతిగుడ్డకైనను, షర్టుమీదనైనను పూసిన మీరు ఆనందించుటయే కాక మీ ప్రక్కనవుండు వారందరు వాసనచూచి ఆనందింతురు. ఒకతూరి తీసి వాడినవారికి దీనిగుణము తెలియును.

డ్రామ్ బాటిల్ 1-కి రూ. 1=00

ధనలక్ష్మి అండ్ కో.,

త పె. నం. 1376 — మదరాసు-1